క్రీడలతో మానసికోల్లాసం

కృష్ణకాలనీ, జనవరి 13: క్రీడలు మానసికల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతో ఉపయోగపడతాయని జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్ యాదవ్, భూపాలపల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బండారి సంపూర్ణా రవి అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మున్సిపల్ పరిధి కాసింపల్లిలో బీఆర్ఎస్ అర్బన్ యూత్ ప్రధాన కార్యదర్శి పోలవేని మహేందర్, ఉపాధ్యక్షుడు సామల హరీశ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ప్రథమ బహుమతి సంఘం శ్రీనివాస్ టీమ్, ద్వితీయ బహుమతి కోడూరు మహేందర్ టీమ్‌లు గెలుపొందగా వారు బహుమతులు అందజేశారు. యువత క్రీడల్లో రాణిస్తూ, సామాజిక సేవలో ముందుండాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, 13వ వార్డు కౌన్సిలర్ మంగలపల్లి తిరుపతి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోలవేణి అశోక్‌యాదవ్, మామిడి కుమార్ యాదవ్, పొనుగోటి రమేశ్, క్రీడాకారులు నలిగేటి సతీశ్, జోరు కృష్ణ, మేకల అనిల్, చల్లూరి మహేశ్, కెక్కర్ల రమేశ్, సోమరపు రవితేజ, అంగిడి భిక్షపతి, బడితల సాయి, చల్ల అనిల్ పాల్గొన్నారు.

శ్రీనివాస్ టీమ్‌కు బహుమతి అందజేస్తున్న సంపత్ కుమార్ యాదవ్

గోపాలపూర్‌లో కబడ్డీ పోటీలు

చిట్యాల, జనవరి 13 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని గోపాలపురంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎండీ రబ్బాని, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్ ప్రారంభించారు. కాసేపు క్రీడల్లో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో పీఈటీలు చల్ల శ్రీనివాసరెడ్డి, కూచన భిక్షపతి, పాలకుర్తి నవీన్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు గోవింద భద్రయ్య, గోల్కొండ సతీశ్, నీలం కుమారస్వామి, సంజీవ్, గొర్రె శశిధర్, కాట్రేపుల ఐలయ్య, క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీలు కోడూరు రాజు, నీలం శాంతి కుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రబ్బాని

భరతనాట్యంలో హర్షిణికి అవార్డు

కృష్ణకాలనీ, జనవరి 13 : జాతీయస్థాయి భరతనాట్యంలో జిల్లాకు చెందిన దుప్పటి హర్షిణి ఉత్తమ ప్రతిభ కనబరిచి జగత్ విఖ్యాత అవార్డు పొందింది. ఖమ్మం జిల్లాకేంద్రంలోని భక్త రామదాసు ఆడిటోరియంలో సంక్రాంతి జాతీయ ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఖమ్మం వారి స్వరమాధురి కల్చరల్ అకాడమీ నిర్వహించిన జాతీయస్థాయి భరతనాట్యం పోటీల్లో ఆమె పాల్గొంది. నిర్వాహకులు ఇసనపెల్లి నగేశ్, వేల్పుల వెంకటేశ్, నృత్య గురువు నానీ మాస్టర్ హర్షిణిని అభినందించారు.

హర్షిణికి అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ

గణపురం, జనవరి 13: మండలకేంద్రానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు గాజర్ల రఘుపతి గౌడ్ జ్ఞాపకార్థం ఆయన తనయుడు బీఆర్ఎస్ జిల్లా యూత్ నాయకుడు గాజర్ల చింటూ గౌడ్ సోమవారం టీ షర్ట్స్ పంపిణీ చేశారు. అనంతరం గణపురం క్రికెట్ టీమ్ తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్రికెట్ టీమ్ సభ్యులు నిమ్మ సురేందర్, తాళ్లపల్లి సాయి వర్ధన్, ఇమ్రాన్, వాజిత్, ముజ్జు, సోను, రోహన్, బబ్లూ, తాళ్లపల్లి శివ, అఖిల్, వాంకుడోత్ గణేశ్, కార్తీక్, రాపర్తి సాయిరాం, రాజు, హఫీజ్ పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

గోవిందరావుపేట, జనవరి 13 : మండలంలోని తపమంచ గ్రామానికి చెందిన ఊకే సౌజన్య 108 వాహనంలో ప్రసవించింది. సౌజన్య పురిటి నొప్పులతో బాధపడుతుండగా సోమవారం తెల్లవారు జామున 108కు సమాచారం అందించారు. ఆమెను ములుగు దవాఖానకు తీసుకెళ్తున్న క్రమంలో మార్గ మధ్యంలో నొప్పులు ఎక్కువ అవడంతో ఈఎంటీ యుగంధర్ పురుడు పోశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండడంతో 108 సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

ఏటూరునాగారం : భోగి మంటల వద్ద స్థానికులు

వైభవంగా భోగి

- ములుగు, జయశంకర్ జిల్లాల్లో పండుగ
- భోగి మంటలు, ముగ్గులు వేసి సంబురాలు
- పలు చోట్ల ముగ్గుల పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన ప్రముఖులు

కృష్ణకాలనీ/ గోవిందరావుపేట/ వెంకటాపురం (నూగూరు)/ఏటూరునాగారం/ కన్నాయిగూడెం/ కాటారం, జనవరి 13: సంక్రాంతి పండుగ సందర్భంగా భోగి పర్వదిన వేడుకలు సోమవారం ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా అలికి ముగ్గులు వేసి ఆవు పేడ పిడకలతో కట్టెలకు నిప్పు అంటించి మంటలు చేశారు. భోగి మంటల చుట్టూ నృత్యాలు చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. పలు మండలాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో భోగి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో 30వ వార్డు కౌన్సిలర్ మాడ కమలా లక్ష్మారెడ్డి, టీజేఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చీకటి గణేశ్, జాగృతి నాయకులు బద్దెల వంశీ , వినయ్ నాయక్, గెల్లి హరీశ్, శరత్, శివప్రసాద్‌రెడ్డి, ఆదిత్య, రామన్, సాయి, చరణ్ పాల్గొన్నారు. 25వ వార్డు కారల్ మార్క్స్ కాలనీలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్యాతరాజు సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ బహుమతులు అందజేశారు. వెంకటాపురం(నూగూరు) మండలకేంద్రంలోని శివాపురంలో యువకులు, మహిళలు భోగి మంటలు వేసి పండుగ వేడుకలను నిర్వహించారు. ఏటూరునాగారం మండలకేంద్రంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ ప్రాంగణంలో సోమవారం తెల్లవారు జామున భోగి మంటలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలైన ముగ్గురికి పీఆర్ఆర్ యూనిటీ అండ్ చారిటీ ట్రస్టు నిర్వాహకులు మడుగూరి నాగేశ్వర్‌రావు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో వెలకుర్తి లక్ష్మణాచారి, సరికొప్పుల వెంకటేశ్వర్లు, ముక్కెర భిక్షపతి, ముక్కెర లాలయ్య, పున్నెం కిరణ్, పున్నెం ప్రశాంత్, గాజర్ల శంకర్ రావు, మహిళలు పాల్గొన్నారు. కన్నాయిగూడెం మండల కేంద్రంలోని రామాలయం ఆవరణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి నేడు బహుమతులు అందించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

గోవిందరావుపేట : చల్వాయిలో భోగి శుభాకాంక్షలు తెలుతూ ముగ్గు వేసిన మహిళలు

వెంకటాపురం(నూగూరు) : భోగి మంటల వద్ద ప్రజలు

కృష్ణకాలనీ : మహిళలకు బహుమతుల అందజేస్తున్న రాజ్‌కుమార్

భూపాలపల్లిలో ముగ్గులు వేస్తున్న యువతులు

కన్నాయిగూడెం : రామాలయం ఆవరణలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

కాటారం: భోగి మంటలు వేస్తున్న ప్రజలు

జీపీ జేసీబీతో ప్రైవేట్ పనులు

- రియల్ ఎస్టేట్ వెంచర్లలో వినియోగం
- గంటల లెక్కన డబ్బులు దండుకుంటున్న అధికారులు

ములుగు, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : ములుగు గ్రామ పంచాయతీ అవసరాల నిమిత్తం ప్రభుత్వం సమకూర్చిన జేసీబీని అధికారులు ప్రైవేట్ పనులకు వినియోగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పల్లె ప్రగతి పనుల్లో భాగంగా పారిశుధ్య పనులు మెరుగుపర్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం జేసీబీ మిషన్‌ను సమకూర్చింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పట్టింపు లేని కారణంగా జీపీ అధికారులు జేసీబీని దుర్వినియోగం చేస్తున్నారు. ప్రజా అవసరాలకు కాకుండా రియల్ ఎస్టేట్ వెంచర్లు చేసే వ్యాపారులు, బడా రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు నిర్వహించే అభివృద్ధి పనులతో పాటు గ్రామంలోని కొందరి సొంత పనులకు జేసీబీని అప్పగిస్తున్నారు. రాజకీయ పైరవీలతో కొందరికి ఉచితంగా అందిస్తుండగా దీన్ని ఆసరాగా చేసుకున్న కిందిస్థాయి సిబ్బంది కొన్ని సందర్భాల్లో గంటల లెక్క కిరాయికి ఇస్తూ వేలాది రూపాయలు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా రెండు రోజులుగా ములుగు జిల్లాకేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో గ్రామ పంచాయతీ జవాన్ దగ్గరుండి జేసీబీతో చెట్లు తొలగిస్తూ రోడ్లు వేయిస్తూ కనిపించాడు. గత పాలకవర్గ సభ్యులు ఇష్టారీతిన జేసీబీని వినియోగించగా అదే తరహాలో అధికారులు సైతం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై జవాన్‌ను వివరణ కోరగా పొలాల్లో చెట్లు తొలగించే పనిని చేపడుతున్నామని తెలిపాడు. గ్రామ పంచాయతీ ఈవో పెంట రఘును వివరణ కోరగా తాము ఎవరికి ఉచితంగా జేసీబీని ఇవ్వడం లేదని, జీపీకి రుసుము చెల్లిస్తే పంపిస్తామన్నారు. లేకుంటే రైతుల అవసరాలకు పంపిస్తుంటామని చెప్పారు. రియల్ ఎస్టేట్ పనులకు జేసీబీని పంపించే వీలు లేదని పేర్కొన్నారు. జీపీ రసీదు ఉంటేనే బయట పనులకు వెళ్తుందని తెలిపారు.

ములుగులోని రియల్ ఎస్టేట్ వెంచర్‌లో పనులు చేస్తున్న జీపీ జేసీబీ

కమనీయం గోదా రంగనాథ స్వామి కల్యాణం

గణపురం/ మహదేవపూర్/ కాటారం/ ఏటూరునాగారం/ మంగపేట, జనవరి 13 : గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణం ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో సోమవారం వైభవంగా నిర్వహించారు. గణపురం మండలకేంద్రంలోని పట్టాభి సీతా రామచంద్రస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి లలితా గోవర్ధన్ దంపతులచే వేద పండితులు గోవర్ధన దుర్వాస చార్యులు, గోవర్ధన వేణుగోపాలాచార్యులు, ఆలయ అర్చకులు ముసునూరు నరేశ్ కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బండారు శంకర్, మోటపోతుల రాజన్న గౌడ్, మాదాసు మొగిలి, మాదాసు అర్జున్, బూర రాజగోపాల్, మూల శ్రీనివాస్ గౌడ్, దయ్యాల భద్రయ్య, బటిక స్వామి పాల్గొన్నారు. మహదేవపూర్ మండలం ఎల్కేశ్వరంలోని సీతారామచంద్ర స్వామి ఆలయ ఆవరణలో వరుణ్ చార్యులు, సుప్రతి చార్యుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి సుమారు 1500 మంది భక్తులు తరలివచ్చారు. కాటారం మండలం చిద్నెపల్లి జీపీ పరిధి బొప్పారం సీతారామ చంద్రస్వామి ఆలయంలో వేదపండితుడు సముద్రాల రామాచార్యులు కన్నుల పండువగా కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్తలు ఊర నందకిశోర్‌రావు – సుసాన్‌రావు, నందగోపాల్‌రావు–జయచైతన్యరావు భక్తులకు అన్నదానం చేశారు. కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి– రజిత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీలు రవీందర్‌రావు, తోట జనార్దన్, మాజీ సర్పంచ్ రాజమౌళి పాల్గొన్నారు. ఏటూరునాగారం మండలకేంద్రంలోని సీతా రామచంద్రస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు ఎల్లాప్రగడ నాగేశ్వర్‌రావు శర్మ, వేద పండితులు మణికంఠశర్మ, కృత్తిక శర్మ కల్యాణ కృతువు జరిపించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు ప్రత్యేక పూజలు చేశారు. ప్రదీప్‌రావు, అల్లి శ్రీనివాస్, మెరుగు వెంకటేశం, కృష్ణ, భాస్కర్‌బాబు పాల్గొన్నారు. మంగపేట మండలం బోరునర్సాపురం రామాలయంలో నిర్వహించిన కల్యాణ వేడుకల్లో సీపీఐ మాజీ డైరెక్టర్ మన్నెం నాగేశ్వర్‌రావు, ఆలయ కమిటీ బృందం, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

మహదేవపూర్ : కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

యువత క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 13 : మండలకేంద్రంలో సోమవారం కాఫెడ్ క్రీడా మైదానంలో మండల క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. సీఐ బండారి కుమార్ హాజరై క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు వ్యక్తిగత నైపుణ్యాలను వెలికి తీసేందుకు దోహద పడుతాయన్నారు. అనంతరం పోలీస్, ప్రెస్ టీమ్ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు. కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు పాల్గొన్నారు. అలాగే తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ ఏర్పాటు చేయగా సీఐ హాజరయ్యారు. ప్రథమ బహుమతి కలిపాక, ద్వితీయ బహుమతి సీతారంపురం జట్లు గెలుచుకున్నాయి. నాయకులు చిరంజీవి, దామోదర్, ఇర్ప శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జ్ఞానం వాసు, కుమ్మరి శ్రీను, నర్సింహాచారి, చిట్టెం ఆదినారాయణ, సోడి అశోక్, పవన్, నర్సింహస్వామి పాల్గొన్నారు.

క్రీడలను ప్రారంభిస్తున్న సీఐ బండారి కుమార్

నియామక పత్రాలు అందజేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్

బీఆర్ఎస్ కుందనపల్లి గ్రామ కమిటీ ఎన్నిక

టేకుమట్ల, జనవరి 14 : బీఆర్ఎస్ కుందనపల్లి గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా పొన్నం చంద్రయ్య గౌడ్, ఉపాధ్యక్షులుగా మాస్కుల రాజయ్య, గుజ్జుల వెంకటేశ్, గౌరవ అధ్యక్షుడిగా రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బోనల సాగర్, సహాయ కార్యదర్శిగా నడిగొట్ట రాజయ్య, కోశాధికారిగా అబ్బ కుమార్, ప్రచార కార్యదర్శిగా జూజిరి కుమారస్వామి, ముఖ్య సలహాదారుగా పర్ణంది పైడి, దొమ్మటి ఓదెలు, జంగిలి లక్ష్మణ్‌రావు, అంకుశ్, బోనల నర్సయ్య, వేల్పుల సమ్మయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పింగిలి వెంకటేశ్వర్ల రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్ మారం లింగారెడ్డి, మాజీ ఎంపీపీ బండెల నరేశ్, గువ్వడి లక్ష్మణ్, యూత్ నాయకులు మేకల రాజు, సలీం, బోనల సతీశ్, జంగలపల్లి రమేశ్, పంజాల రాకేశ్, నడిగొట్ట సంపత్, కార్యకర్తల పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ సమస్య పరిష్కరించాలి

గోవిందరావుపేట, జనవరి 13 : మండలంలోని పస్రా జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గొంది రాజేశ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పస్రాలో నెల రోజులుగా లైట్లు వెలుగకపోవడంతో అధికారులకు చెప్పినా పట్టింకోవడంలేదన్నారు. వెంటనే స్థానిక అధికారులు స్పందించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, నాయకులు ఆగిరెడ్డి, చిట్టిబాబు, నాగరాజు, ఆదిరెడ్డి, మురళి, సూర్యనారాయణ, ఉపేంద్రాచారి, రమేశ్, శ్రీను పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ములుగురూరల్, జనవరి 13 : ములుగులోని శాంతిస్తూపం సమీపంలోని థియేటర్ వద్ద సోమవారం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. బిక్షాటన చేస్తున్న వృద్ధుడు మృతి చెందిన విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పరిశీలించి గ్రామ పంచాయతీకి సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకొని ములుగు దవాఖానలోని మార్చురీకి తరలించినట్లు చెప్పారు. వృద్ధుడి వివరాలు తెలిసిన వారు 8712670082, 8712670081 నంబర్లను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

తవేరా వాహనం బోల్తా

గోవిందరావుపేట, జనవరి 13 : మండలంలోని పస్రా సమీపంలోని గుండ్లవాగు బ్రిడ్జి మూలమలుపు వద్ద సోమవారం తవేరా వాహనం బోల్తా పడింది. వివరాలిలా ఉన్నాయి. ఏటూరునాగారం నుంచి హనుమకొండ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పలువురికి స్వల్ప గాయాలు కాగా ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించినట్లు తెలిసింది.

16వ తేదీ నుంచి గ్రామసభలు

వాజేడు, జనవరి 13 : సంక్షేమ పథకాల లబ్దిదారులను ఎంపిక చేసేందుకు ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న నాగారం జీపీ పరిధిలోని రైతు వేదికలో అధికారులకు సమావేశం నిర్వహిస్తామని, అనంతరం గ్రామాల వారీగా గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరాహార దీక్ష

మంగపేట, జనవరి 13 : కమలాపురం బిల్టు ఫ్యాక్టరీలో పని చేసిన తమకు వేతన సెటిల్‌మెంట్ సమస్యలు పరిష్కరించకుంటే నిరాహార దీక్షలకు దిగుతామని పలువురు కార్మికులు అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. కొద్ది రోజుల్లో కమలాపురంలో నూతన పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తున్నదని, కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు మొత్తం చెల్లించకుండా పరిశ్రమ ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామన్నారు. తమ సమస్యపై స్థానిక మంత్రితో పాటు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు స్పందించి సహరించాలని కోరారు. సమావేశంలో బత్తుల వెంకటనారాయణ, గుల్లగట్టు విజయ రావు, గూడ యాదగిరి, పంజాల సత్యనారాయణ, ముత్తినేని వెంకటేశ్వర్లు, గాజర్ల శ్రీను, తాటికొండ వెంకటేశ్వర్‌రావు, అన్నపూర్ణ, పార్వతి పాల్గొన్నారు.

నాల్గో రోజు కొనసాగుతున్న లారీల సమ్మె

భూపాలపల్లి రూరల్, జనవరి 13 : బొగ్గు రవాణా చేసే లారీలకు మెయింటనెన్స్ చార్జీలు పెంచాలని కోరుతూ కాకతీయఖని లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలో 4వ రోజు సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రయ్య మాట్లాడుతూ రెండేళ్లుగా లారీలకు మెయింటనెన్స్ చార్జీలు పెంచకపోవడంతో యజమానులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఫైనాన్స్ కట్టలేక అప్పుల పాలవుతున్నారని తెలిపారు. వెంటనే సింగరేణి జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చొరవ తీసుకొని ట్రాన్స్ పోర్ట్ యజమానులతో మాట్లాడి ఆదుకోవాలని కోరారు. లేకపోతే కుటుంబాలతో ధర్నా చేస్తామన్నారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి

కృష్ణకాలనీ, జనవరి 13 : జిల్లాలో ధర్మ సమాజ్ పార్టీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని రాష్ట్ర నాయకుడు మేకల సుమన్ పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్ అధ్యక్షతన జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించగా ఆయన హాజరై పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రణాళికపై పలు సూచనలు, సలహాలు చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల శ్రీనివాస్, చిట్యాల మండల అధ్యక్షుడు పర్ల పల్లి కుమార్, మండల ఉపాధ్యక్షుడు పుల్ల అశోక్, నద్దునూరి రాజ్‌కుమార్, రత్న రమేశ్, భూపాలపల్లి పట్టణ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

కాటారం, జనవరి 13 : డ్రైవర్లతో పాటు ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని సీఐ నాగార్జున రావు పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం కాటారం పోలీస్టేషన్ ఆవరణలో 200 మంది ఆటో డ్రైవర్లకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, వాహనాలు ఫిట్‌గా ఉండేలా చూసుకుని, అన్ని డాక్యుమెంట్లు వెంట ఉంచుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని, మద్యం తాగి వాహనాలు నడుపొద్దన్నారు. కార్యక్రమంలో పీఎస్సై హేమలత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ నాగార్జునరావు